# విశాల భారతి

తెలుగు దినపత్రిక

31-03-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ | సంపుటి:4 సంచిక: 86


## సొంత ప్రభుత్వంపై రాములమ్మ ఫైర్!

- ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని విజయశాంతి ప్రశ్న
- నెలకు రూ. 25 వేల పెన్షన్, ఉద్యోగ హామీపై అసహనం
- జూన్ 2న ఇస్తామన్న ఐడీ కార్డుల ఊసేలేదని ఫైర్
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా పనులు కాలేదని విమర్శ
- ఎమ్మెల్యేలకు నిధులివ్వడం లేదని గతంలోనే రాజగోపాల్ రెడ్డి ఆగ్రహం
- హామీల అమలుపై సొంత పార్టీ నేతలే ఇప్పుడు ఎదురుదాడి

05



# కట్నం రక్కసి కోరల్లో ఆడ బిడ్డలు



## తెలంగాణలో 51,586 వేధింపుల కేసులు నమోదు

తెలంగాణలో 776, ఏపీలో 526 మరణాలు

- దేశంలో సగటున రోజూ 20 మంది బలి
- 2023లో వరకట్న నేరాలు 14శాతం పెరిగాయి
- వరకట్న చావులు సమాజానికి చెరగని మచ్చ
- కేసులు తక్కువైనా, మరణాలు పెరగడం ఆందోళనకరం
- 2017-21 మధ్య దేశంలో 35,000 మరణాలు
- 2023లో దేశవ్యాప్తంగా 6,156 మంది మృతి
- నిషేధ చట్టం ఉన్నా, వేధింపులు ఆగడం లేదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో వరకట్న వేధింపుల పరంపర అదుపులేకుండా కొనసాగుతుండటం సభ్య సమాజాన్ని తీవ్రంగా కలవరపెడుతోంది. కొత్త జీవితంపై వేల ఆశలతో అత్తవారింట్లో అడుగుపెట్టిన యువతులు, కట్నం వేధింపులకు గురై ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు నిత్యం వార్తల్లో నిలుస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల గణాంకాలను పరిశీలిస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. గడిచిన ఐదేళ్ల కాలంలో సుమారు 1304 మంది మహిళలు వరకట్న రక్కసికి బలైపోయారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 526 మరణాలు సంభవించగా, తెలంగాణలో 776 కేసులు నమోదవ్వడం ఆందోళనకరం. ఈ సంఖ్యలు కేవలం పోలీసు రికార్డులకు ఎక్కినవి మాత్రమే కాగా, బయటకు రాని వేధింపులు మరెన్నో ఉంటాయని సామాజిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మిగతా 2లో..



## కేసీఆర్ లేకపోతే నేను లేను

- రావణుడి వల్లే రాముడికి పేరు.. కేసీఆర్ వల్లే నాకు గుర్తింపు
- కేసీఆర్‌ను ఇంట్లో బంధించారా? అని సీఎం అనుమానం
- నియోజకవర్గాల విభజనతో దక్షిణాది అన్యాయం
- క్షిణాది సీట్ల కోసం బీజేపీ ఎంపీ రాజీనామా చేయాలి
- రాష్ట్ర ప్రజలందరికీ త్వరలో ఉచిత పరీక్షలు
- కేసీఆర్ 'ఉరి' అంటే.. మేము 'బోనస్' ఇస్తున్నాం
- రూ.500 గ్యాస్ పథకంలో మార్పులు ఉండవు
- రాష్ట్ర నిధుల్లో కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తోంది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన విమర్శనాస్త్రాలు ఇప్పుడు పెను సంచలనంగా మారాయి. సచివాలయం వేదికగా మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో ఆయన పంచుకున్న అంశాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలనతో తనను పోల్చుకుంటూనే, తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు రావడానికి గత పాలకుల వైఫల్యాలే కారణమని రేవంత్ రెడ్డి విశ్లేషించారు. రావణాసురుడి అకృత్యాలు ఉన్నప్పుడే రాముడిలోని సద్గుణాలు

మిగతా 3లో..

## గవర్నర్ వద్దకు పొంగులేటి పంచాయితీ



- మంత్రి పొంగులేటి అక్రమాలపై గవర్నర్‌ను కలిసిన కేటీఆర్ బృందం
- అవినీతి ఆరోపణల నేపథ్యంలో మంత్రిని వెంటనే తొలగించాలని వినతి
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్‌తో ఖజానాకు గండి కొట్టారని ఆరోపణ
- ఈ స్కామ్‌పై హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్
- అసెంబ్లీలో ప్రశ్నిస్తే సభ్యులను సస్పెండ్ చేయడంపై ఆగ్రహం
- అమృత్ స్కామ్, ఫోన్ ట్యాపింగ్‌పై విచారణకు సిద్ధమా అని సవాల్

02

## కాంగ్రెస్, నక్సల్ భాయీ.. భాయీ..!



- దేశంలో నక్సలిజం దాదాపు అంతమైందని అమిత్ షా ప్రకటన
- తుపాకీ పట్టిన వారిని ప్రభుత్వం వదిలిపెట్టదని హెచ్చరిక
- నక్సల్స్ అడ్డాలో ఇప్పుడు స్కూళ్లు, రోడ్లు వచ్చాయని వెల్లడి
- నక్సలిజం పెరగడానికి కాంగ్రెస్ విధానాలే కారణమని ధ్వజమెత్తు
- రాష్ట్రంలో అనేకమంది నక్సల్స్ నేతలు లొంగిపోయారని వెల్లడి
- గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కోసం రూ.4 వేల కోట్లు ఖర్చు

04

## ప్రశ్నించే గొంతుకపై దాడి

- మొదటి తప్పుకే 7 ఏళ్లు, రెండోసారికి 10 ఏళ్ల జైలు
- నేరాన్ని బట్టి 50 వేల నుండి లక్ష వరకు ఫైన్
- ఈ చట్టం కింద కేసులు నాన్-బైలబుల్
- యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలపై ఉక్కుపాదం
- నిందితుల నుంచి పరిహారం వసూలు చేసే కొత్త నిబంధన
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే జైలు పాలయ్యే ప్రమాదం

03



## బీఆర్ఎస్ ఎమ్మెల్సీల సస్పెన్షన్

- రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ డిమాండ్
- అక్రమ మైనింగ్ ఆరోపణలతో పొంగులేటి బర్తరఫ్‌కు పట్టు
- దొంగల రాజ్యం అంటూ సభలో ప్లకార్డుల ప్రదర్శన
- నిరసనల మధ్యే బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసిన చైర్మన్
- సస్పెండైన సభ్యులను బలవంతంగా బయటకు పంపిన మార్షల్స్
- 2014 నుంచి జరిగిన మైనింగ్ దందాలపై సీబీసీఐడీ విచారణ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ శాసన మండలి సమావేశాలు సోమవారం అత్యంత ఉత్కంఠభరితంగా ప్రారంభమయ్యాయి. సభ కొలువుదీరిన కొద్దిసేపటికే ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు నిరసన గళం విప్పారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థకు సంబంధించిన వ్యవహారాలపై హౌస్ కమిటీని నియమించాలని డిమాండ్ చేస్తూ సభా వేదికను హోరెత్తించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రసంగిస్తున్న సమయంలో విపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ

మిగతా 2లో..

## టార్గెట్ పొంగులేటి..!

- సీఎం రేవంత్ కంటే ఎక్కువగా పొంగులేటిపైనే బీఆర్ఎస్ గురి
- మంత్రిపై మైనింగ్ ఆరోపణలు, హౌస్ కమిటీకి విపక్షం డిమాండ్
- బీఆర్ఎస్ అక్రమాలకు పొంగులేటి అడ్డుపడుతున్నారని సీఎం వెనకేసుకొచ్చారు
- పాత పనులు కావడం లేదన్న కోపంతోనే ఈ దాడి అని కాంగ్రెస్ వాదన
- గతంలో బీఆర్ఎస్‌లో ఉన్నందున ఆయన బలహీనతలపై విపక్షం గురిపెట్టింది
- పొంగులేటి బిజినెస్‌ను దెబ్బతీసి రాజకీయంగా అణచాలని బీఆర్ఎస్ ప్లాన్
- కేవలం అసెంబ్లీకే కాకుండా గవర్నర్ వరకు ఈ వివాదం చేరింది
- గత ఎన్నికల్లో ఖమ్మంలో బీఆర్ఎస్‌ను క్లీన్ స్వీప్ చేయడమే ఈ పగకు కారణం
- మంత్రిని టార్గెట్ చేసి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలనే వ్యూహం
- ఇది అవినీతిపై పోరాటమా లేక రాజకీయ కక్షా అన్నది ఇప్పుడు చర్చనీయాంశం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య సాగుతున్న పోరు యుద్ధాన్ని తలపిస్తోంది. ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని గులాబీ దళం సాగిస్తున్న దాడి రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంటే ఎక్కువగా పొంగులేటినే టార్గెట్ చేయడం వెనుక బలమైన రాజకీయ వ్యూహం దాగి ఉందనే చర్చ సర్వత్రా సాగుతోంది. అసెంబ్లీ వేదికగా మొదలైన ఈ వివాదం ఇప్పుడు వీధికెక్కింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన వ్యవహారాలను సాకుగా చూపిస్తూ పొంగులేటి తన పరపతిని పెంచుకోవాలని

మిగతా 2లో..

## హేట్ స్పీచ్ బిల్లుతో కాంగ్రెస్‌కే ఇబ్బంది



- ఈ బిల్లు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే "డెత్ వారెంట్"
- పాలనపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినా అరెస్ట్
- సెక్షన్ 3 కింద కేసులు, నాన్-బైలబుల్
- వాట్సాప్ గ్రూప్‌లో ఒకరు తప్పు చేసినా అందరికీ జైలు
- ఇది ప్రజల రక్షణ కోసం కాదు, భయపెట్టడానికే
- వెంటనే ఈ బిల్లును హౌస్ కమిటీకి పంపాలి

03

## ప్రజాస్వామ్య గొంతుకను నొక్కేందుకే 'హేట్ స్పీచ్'



- ఈ బిల్లు పౌర స్వేచ్ఛను హరించే ఆయుధమని కేటీఆర్ ధ్వజం
- భావప్రకటన స్వేచ్ఛను కాలరాయడం ప్రజాస్వామ్యానికే ముప్పు
- అస్పష్టమైన నిబంధనలతో అధికారుల ఇష్టారాజ్యం సాగుతుంది
- విపక్ష నేతలు, జర్నలిస్టులు, సోషల్ మీడియా యాక్టివిస్టులే లక్ష్యం
- విమర్శ శిక్షార్హం కాదని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు
- 10 ఏళ్ల జైలుతో ప్రజలను భయపెట్టాలని చూస్తున్నారు
- విమర్శ చేస్తే 'ఫేక్' అని ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం
- ఇప్పటికే చట్టాలు ఉండగా, కొత్త బిల్లు ఆంతర్యం ఏంటి?
- వెంటనే ఈ బిల్లును పునర్విమర్శించాలని కేటీఆర్ డిమాండ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో అధికార పీఠం దక్కించుకున్న కాంగ్రెస్ సర్కార్ ప్రజాస్వామ్య గొంతుకను నొక్కేందుకు కుట్రలు పన్నుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ బిల్లు' పౌర స్వేచ్ఛను హరించే ఒక క్రూరమైన ఆయుధమని ఆయన అభివర్ణించారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వ నిరంకుశ పోకడలపై ఆయన నిప్పులు చెరిగారు. తన వైఫల్యాలను ఎండగట్టే విమర్శకుల నోళ్లు మూయించడమే లక్ష్యంగా రేవంత్ ప్రభుత్వం ఇటువంటి నల్ల చట్టాలను తెరపైకి తెస్తోందని మండిపడ్డారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు తూట్లు పొడిచినట్లేనని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం

మిగతా 3లో..

# టార్గెట్ పొంగులేటి..!

**మొదటిపేజీ తరువాయి**



చూస్తున్నారని, దీనిని అడ్డుకోవడమే తమ లక్ష్యమని బీఆర్ఎస్ నేతలు బాహాటంగానే ప్రకటిస్తున్నారు. పాలనలో పారదర్శకత కరువైందని, కేవలం ఒకే ఒక్క మంత్రి కనుసన్నల్లోనే కీలక నిర్ణయాలు జరుగుతున్నాయని ప్రతిపక్షం ఆరోపిస్తోంది. కొత్త ప్రాజెక్టుల కేటాయింపులు, టెండర్ల ప్రక్రియలో పొంగులేటి తన వ్యాపార ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని బీఆర్ఎస్ నేతలు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. గతంలో తమకు అనుకూలంగా ఉన్న వ్యవస్థలను ప్రక్షాళన చేస్తున్నామనే సాకుతో, తమ సొంత సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్నారని వారు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే పొంగులేటి అక్రమ మైనింగ్ వ్యవహారాలపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాపార సామ్రాజ్యంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న దాడి కేవలం ఆరోపణలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి ఆధారాలను సేకరించే వరకు వెళ్లింది. గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా దీనిని జాతీయ స్థాయి చర్చగా మార్చాలని వారు భావిస్తున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని వేల కోట్ల రూపాయల మైనింగ్ దోపిడీకి పాల్పడుతున్నారని, దీనిపై నిష్పాక్షిక విచారణ జరగాలని పట్టుబడుతున్నారు. ఒకప్పుడు తమ పార్టీలోనే ఉన్న వ్యక్తి కావడంతో, ఆయన ఆర్థిక మూలాలు ఎక్కడున్నాయో తమకు తెలుసని, అందుకే ఆధారాలతో సహా బయటపెడుతున్నామని గులాబీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఖమ్మం జిల్లా రాజకీయాల్లో పొంగులేటి పోషించిన పాత్ర బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ తీసింది. గత ఎన్నికల్లో ఆ జిల్లాలో కారు గుర్తును తుడిచిపెట్టడంలో ఆయన కీలక సూత్రధారిగా వ్యవహరించారు. భవిష్యత్తులో కూడా ఆయన పట్టు పెరిగితే జిల్లాలో తమ మనుగడ కష్టమని భావిస్తున్న బీఆర్ఎస్, ముందస్తుగానే ఆయన ఇమేజ్‌ను దెబ్బతీయాలని చూస్తోంది. అవినీతి ముద్ర వేయడం ద్వారా ప్రజల్లో ఆయనపై ఉన్న నమ్మకాన్ని సడలించవచ్చని భావిస్తోంది. రేవంత్ రెడ్డి కంటే పొంగులేటిని టార్గెట్ చేయడం వల్ల అటు ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో పడేయొచ్చని వారి ఎత్తుగడ.

ప్రభుత్వంలోని కీలక శాఖలు పొంగులేటి వద్దే ఉండటం, నిర్ణయాధికారాల్లో ఆయన మాటే చెల్లుబాటు కావడం ఇతర మంత్రుల్లో కూడా అసహనానికి దారితీస్తోందని ప్రచారం సాగుతోంది. దీనిని ఆసరాగా చేసుకుని అధికార పార్టీలో చీలిక తేవాలని ప్రతిపక్షం ప్రయత్నిస్తోంది. ఒకే వ్యక్తి చుట్టూ అధికారం కేంద్రీకృతం కావడం వల్ల ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటోందని వారు వాదిస్తున్నారు. భూ అక్రమాలు, ఇసుక దోపిడీ వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ సోషల్ మీడియా వేదికగా యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రిని కాపాడుకునే క్రమంలో చేస్తున్న వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశంగా మారాయి. గత ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపడం ద్వారా ప్రస్తుత అక్రమాలను కప్పిపుచ్చుకోలేరని బీఆర్ఎస్ నేతలు తిప్పికొడుతున్నారు. హౌస్ కమిటీ వేయడానికి ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని వారు ప్రశ్నిస్తున్నారు. నిజంగా తప్పు చేయకపోతే విచారణకు సిద్ధపడాలని సవాల్ విసురుతున్నారు. ఈ పరిణామాలు రాష్ట్రంలో రాజకీయ వేడిని మరింత పెంచాయి.

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీయడం ద్వారా ఆయనను రాజకీయంగా ఒంటరిని చేయాలనేది బీఆర్ఎస్ అసలు వ్యూహంగా కనిపిస్తోంది. పెద్ద ఎత్తున నిధుల సమీకరణ చేస్తూ కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తున్న ఆయన ఆర్థిక మూలాలను దెబ్బతీస్తే, ఆటోమేటిక్‌గా పార్టీ బలహీనపడుతుందని వారు అంచనా వేస్తున్నారు. అందుకే ఆయన వ్యాపార ఒప్పందాలపై నిశితంగా నిఘా పెట్టి, ప్రతి చిన్న లొసుగును భూతద్దంలో చూపిస్తున్నారు. ఇది కేవలం అవినీతిపై పోరాటం మాత్రమే కాదు, మనుగడ కోసం సాగుతున్న పోరు. ప్రస్తుత తరం యువత ఈ రాజకీయ చదరంగం వైపు ఆసక్తిగా చూస్తోంది. అభివృద్ధి కంటే ఆరోపణలకే ప్రాధాన్యత ఇస్తున్న తీరుపై అసహనం వ్యక్తమవుతున్నా, అవినీతి అంశాలు తెరపైకి రావడం చర్చకు దారితీస్తోంది. ఒక మంత్రి స్థాయి వ్యక్తిపై ఇంత పెద్ద ఎత్తున ఆరోపణలు రావడం సాధారణ విషయం కాదు. దీనిపై ప్రభుత్వం ఇచ్చే వివరణలు ప్రజలను ఎంతవరకు మెప్పిస్తాయో చూడాలి. పారదర్శకత గురించి మాట్లాడే రేవంత్ సర్కారు, పొంగులేటి విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తోందని ప్రతిపక్షం నిలదీస్తోంది. అధికార పక్షం వాదన ప్రకారం, పొంగులేటి పాత అక్రమాలను వెలికితీస్తుండటం వల్లే బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అయితే, ప్రతిపక్షం మాత్రం తమ వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని చెబుతోంది. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ అక్రమ మైనింగ్ వల్ల జరుగుతున్న పర్యావరణ నష్టాన్ని కూడా వివరిస్తున్నారు. ప్రజల్లోకి ఈ విషయాన్ని బలంగా తీసుకెళ్లడం ద్వారా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారు. రాజకీయం ఇప్పుడు వ్యక్తిగత దూషణల స్థాయికి పడిపోవడం విచారకరం.

రాష్ట్ర రాజకీయాల్లో పొంగులేటి ఒక పవర్ సెంటర్‌గా ఎదగడం బీఆర్ఎస్‌కు మింగుడుపడటం లేదు. ఆయన ప్రభావం కేవలం ఖమ్మం జిల్లాకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తుండటం వారిలో ఆందోళన కలిగిస్తోంది. అందుకే ఆయనను ఒక వివాదాస్పద వ్యక్తిగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ పోరాటంలో గెలుపెవరిదో తేలాల్సి ఉంది. విచారణ కమిషన్లు, కోర్టు కేసులు ఈ వివాదాన్ని ఎటువైపు తీసుకెళ్తాయో వేచి చూడాలి. నిజమైన సామాజిక న్యాయం, అవినీతి రహిత పాలన అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోకూడదు. ప్రస్తుతం జరుగుతున్న ఈ రాజకీయ యుద్ధం ప్రజల సమస్యలను పక్కదారి పట్టిస్తోందనే విమర్శలు కూడా ఉన్నాయి. ఏది ఏమైనా పొంగులేటి వర్సెస్ బీఆర్ఎస్ పోరు మాత్రం తెలంగాణ రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయానికి తెరలేపింది. అధికార అహంకారమా లేక నిజాయితీ గల పోరాటమా అనేది కాలమే నిర్ణయిస్తుంది. ప్రజా క్షేత్రంలో అసలు నిజాలు నిగ్గు తేలాల్సి ఉంది.

# గవర్నర్ వద్దకు పొంగులేటి పంచాయితీ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా ప్రతిపక్ష భారత్ రాష్ట్ర సమితి తన రాజకీయ పోరాటాన్ని ముమ్మరం చేసింది. మంత్రిపై వస్తున్న అక్రమ మైనింగ్, భూ కబ్జా ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన గులాబీ దళం.. సోమవారం రాజ్‌భవన్‌కు తరలివెళ్లింది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు నేతృత్వంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రతినిధి బృందం గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో భేటీ అయింది. ఈ సందర్భంగా మంత్రిపై ఉన్న ఆరోపణలను వివరిస్తూ ఒక సమగ్ర వినతి పత్రాన్ని సమర్పించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ నిబంధనలను ఉల్లంఘిస్తున్న పొంగులేటిని తక్షణమే మంత్రి మండలి నుంచి బర్తరఫ్ చేయాలని గవర్నర్‌ను కోరారు. ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి సొంత ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న తీరుపై ఫిర్యాదు చేశారు. మంత్రికి అత్యంత సన్నిహిత సంబంధమున్న 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' సంస్థ కార్యకలాపాలపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నగరానికి తాగునీరు అందించే జంట జలాశయాల పరిరక్షణ ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండానే ఈ సంస్థ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతోందని ఆరోపించారు. పర్యావరణ చట్టాలను తుంగలో తొక్కి కొండలను పిండి చేస్తున్నారని, దీనివల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతినడమే కాకుండా ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల గండి పడుతోందని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం నిషేధిత ప్రాంతాల్లో మైనింగ్ చేయడం నేరమని తెలిసినా, అధికార అండతో యథేచ్ఛగా సాగిస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై గతంలోనే అనేక ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపించారు.

శాసనసభ వేదికగా ఈ అక్రమాలను ప్రశ్నిస్తే ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును కేటీఆర్ తప్పుపట్టారు. ప్రజా సమస్యలను, అవినీతిని సభలో లేవనెత్తడం ప్రతిపక్ష సభ్యుడిగా తమ బాధ్యతని, కానీ ప్రభుత్వం సమాధానం చెప్పలేక తమను సస్పెండ్ చేసిందని మండిపడ్డారు. గొంతు నొక్కడం ద్వారా నిజాలను దాచలేరని, శాసన సభలో చర్చకు అవకాశం ఇవ్వకపోవడంతోనే తాము గవర్నర్ వద్దకు రావాల్సి వచ్చిందని వివరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన చర్చను అడ్డుకుని, ఏకపక్షంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. సభలో తమకు జరిగిన అన్యాయాన్ని, ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్ ఈ విషయంలో జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. గవర్నర్‌తో భేటీ ముగిసిన అనంతరం రాజ్‌భవన్ వెలుపల కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. మంత్రి పొంగులేటి వ్యవహారంపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో పూర్తిస్థాయి న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పరిధిలోని దర్యాప్తు సంస్థలపై తమకు ఏమాత్రం నమ్మకం లేదని స్పష్టం చేశారు. మంత్రి పదవిలో ఉంటే విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉందని, అందుకే ముందుగా ఆయనను పదవి నుంచి తొలగించాలని పట్టుబట్టారు. స్వతంత్ర విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, బాధ్యులకు శిక్ష పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దల ప్రమేయం లేకుండా ఇంత పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు.

అవినీతి రహిత పాలన అందిస్తామని, తప్పు చేస్తే ఎవరినీ వదిలిపెట్టబోమని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. తన మంత్రివర్గ సహచరుడిపై ఇన్ని ఆధారాలతో ఆరోపణలు వస్తున్నా స్పందించకపోవడం వెనుక అర్థమేమిటని నిలదీశారు. గతంలో అవినీతిపై యుద్ధం ప్రకటిస్తానన్న మాటలు ఇప్పుడు ఏమయ్యాయని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి నిజాయితీని నిరూపించుకోవాలంటే తక్షణమే విచారణకు ఆదేశించాలని సవాల్ విసిరారు. సొంత మనుషులు అక్రమాలకు పాల్పడుతుంటే కళ్లు మూసుకోవడం అంటే అవినీతిని ప్రోత్సహించడమేనని విమర్శించారు. ప్రజల సొమ్మును దోచుకుంటున్న వారిని కాపాడటం సమంజసం కాదని పేర్కొన్నారు.

మంత్రి పొంగులేటి వ్యవహారంతో పాటు అమృత్ పథకం టెండర్ల స్కామ్, ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలపై కూడా విచారణకు సిద్ధమా అని రాష్ట్ర ప్రభుత్వానికి కేటీఆర్ సవాల్ విసిరారు. అన్ని అక్రమాలపై సమగ్ర విచారణ జరిపితే కాంగ్రెస్ ప్రభుత్వ అసలు రంగు బయటపడుతుందని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో తమను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని, నిజంగా విచారణపై చిత్తశుద్ధి ఉంటే అన్నింటినీ బయటకు తీయాలని కోరారు. అమృత్ టెండర్లలో జరిగిన అవకతవకల వల్ల వేల కోట్ల రూపాయల ప్రజా ధనం దుర్వినియోగం అయిందని ఆరోపించారు. ఈ కుంభకోణాలన్నింటికీ ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని, ప్రజల ముందు వాస్తవాలను ఉంచాలని డిమాండ్ చేశారు. జంట జలాశయాల పరిరక్షణ అనేది కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదని, ఇది లక్షలాది మంది ప్రజల తాగునీటి సమస్య అని బీఆర్ఎస్ బృందం పేర్కొంది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ చేస్తున్న మైనింగ్ వల్ల జలాశయాలకు ఇన్ ఫ్లో తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం జలాశయాల రక్షణ కోసం కఠినమైన నిబంధనలు అమలు చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన వారు ఆ నిబంధనలను తమకు అనుకూలంగా మార్చుకుని ప్రకృతిని కొల్లగొడుతున్నారని ధ్వజమెత్తారు. పర్యావరణ వేత్తలు సైతం ఈ మైనింగ్‌ను వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్తోందని విమర్శించారు. భవిష్యత్తు తరాలకు తాగునీరు లేకుండా చేసే హక్కు ఎవరికీ లేదని హెచ్చరించారు.

రాష్ట్రంలో రెవెన్యూ శాఖ అనేది అత్యంత కీలకమైనదని, అటువంటి శాఖను నిర్వహిస్తున్న మంత్రి భూకబ్జా ఆరోపణలు ఎదుర్కోవడం దురదృష్టకరమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. భూములను రక్షించాల్సిన వారే భక్షకులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి అండతో జిల్లా స్థాయి అధికారులు సైతం అక్రమాలకు సహకరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను, చెరువులను కబ్జా చేస్తున్న వారి జాబితా తమ వద్ద ఉందని, త్వరలోనే వాటన్నింటినీ బయటపెడతామని స్పష్టం చేశారు. సామాన్య ప్రజలకు న్యాయం జరగాలంటే ఇలాంటి నేతలను పదవుల నుంచి తప్పించడం ఒక్కటే మార్గమని హితవు పలికారు. రెవెన్యూ శాఖలో పారదర్శకత కరువైందని, అక్రమార్కుల రాజ్యంగా మారిందని విమర్శించారు. బీఆర్ఎస్ చేసిన ఈ ఫిర్యాదుపై గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. తాము అందజేసిన పత్రాలను, ఆధారాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని గవర్నర్ హామీ ఇచ్చినట్లు కేటీఆర్ తెలిపారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీల సస్పెన్షన్

**మొదటిపేజీ తరువాయి**



వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని వెంటనే కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. సభలో గందరగోళం నెలకొనడంతో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభ్యులను శాంతించాలని కోరినా ఫలితం లేకపోయింది. నిరసనల హోరు కొనసాగుతుండగానే మంత్రి అడ్లూరి లక్ష్మణ్ 'తల్లి దండ్రుల పరిరక్షణ బిల్లు'ను సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల అరుపులు, కేకల మధ్యే ఈ బిల్లుపై చర్చ జరిగినట్లుగా భావించి సభ ఆమోదం తెలిపింది. అయితే తమ డిమాండ్ నెరవేరని పక్షంలో వెనక్కి తగ్గేదే లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు భీష్మించుకు కూర్చున్నారు. ప్లకార్డులతో చైర్మన్ పోడియంను చుట్టుముట్టారు. సభను నడపడం సాధ్యం కాదని భావించిన చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నిరసన తెలుపుతున్న సభ్యులందరినీ సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. గౌరవ సభ్యులను మర్యాదపూర్వక పద్ధతిలో బయటకు పంపాలని మార్షల్స్‌ను ఆదేశించారు. మార్షల్స్ రంగప్రవేశం చేసి సభ్యులను సభ నుంచి బయటకు పంపడంతో మండలి ఒక్కసారిగా వేడెక్కింది. మండలి సమావేశాలకు ముందే గన్‌పార్క్ వద్ద ఉన్న అమరవీరుల స్తూపం సాక్షిగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. మంత్రుల అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ప్లకార్డులు చేతబూని డిమాండ్ చేశారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థ అక్రమ మైనింగ్‌కు పాల్పడిందని, దీనికి బాధ్యుడైన మంత్రి పొంగులేటిని వెంటనే పదవి నుంచి తొలగించాలని నినదించారు. గత రెండు రోజులుగా శాసనసభలోనూ ఇదే అంశంపై రభస జరిగిన విషయం విదితమే. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రతిపక్షం ఐక్యంగా పోరాటం చేస్తోందని విపక్ష నేతలు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రజాధనం లూటీ అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు ధ్వజమెత్తారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ వ్యవహారంపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ పట్టుబట్టడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయని సభ్యులు పేర్కొంటున్నారు. విచారణలో పారదర్శకత ఉండాలంటే సభా కమిటీయే సరైన మార్గమని వారు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం కేవలం కాలయాపన చేసేందుకే సీబీసీఐడీ విచారణకు ఆదేశించిందని విమర్శించారు. నిధుల మళ్లింపు, అక్రమ మైనింగ్ వంటి ఆరోపణలపై లోతైన దర్యాప్తు జరగాలని విపక్షం కోరుతోంది. ఇప్పటికే అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులపై సస్పెన్షన్ వేటు పడటంతో ఇప్పుడు మండలిలోనూ అదే పునరావృతం కావడం చర్చనీయాంశంగా మారింది. ప్రజాస్వామ్యంలో విపక్షాల గొంతు నొక్కడం తగదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ 2014 జూన్ 2 నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని మైనింగ్ వ్యవహారాలపై సమగ్ర విచారణకు సిద్ధమని ప్రకటించింది. రాఘవ కన్‌స్ట్రక్షన్‌తో సహా గత పదేళ్ల కాలంలో జరిగిన లావాదేవీలను సీబీసీఐడీకి అప్పగిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కానీ ఈ విచారణపై తమకు నమ్మకం లేదని బీఆర్ఎస్ నాయకత్వం తేల్చి చెప్పింది. ప్రభుత్వ ఆధీనంలో ఉండే సంస్థల విచారణ నిష్పక్షపాతంగా జరగదని వారు అనుమానం వ్యక్తం చేశారు. అందుకే ప్రత్యక్షంగా శాసనసభ కమిటీ నివేదిక ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఈ ప్రతిష్టంభన కారణంగా ఉభయ సభల్లోనూ వాడివేడి చర్చలు జరుగుతున్నాయి. అభివృద్ధి పనుల ముసుగులో అవినీతికి పాల్పడ్డారని విపక్షం ఆరోపిస్తోంది.

అసెంబ్లీలో ఆదివారం జరిగిన పరిణామాలే మండలిలోనూ పునరావృతమయ్యాయి. సమావేశాలు కొనసాగినన్ని రోజులు సస్పెన్షన్ అమలులో ఉంటుందని చైర్మన్ కార్యాలయం స్పష్టం చేసింది. సభా గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించడం వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అధికార పక్షం సమర్థించుకుంది. ప్రజలకు ఉపయోగపడే బిల్లులను అడ్డుకోవడం విపక్షాలకే నష్టమని మంత్రులు వ్యాఖ్యానించారు. తల్లిదండ్రుల పరిరక్షణ వంటి కీలకమైన సామాజిక బిల్లును కూడా విపక్షం అడ్డుకోవడం దారుణమని అధికార పక్ష సభ్యులు పేర్కొన్నారు. కానీ తమ ఆందోళన ప్రజా ప్రయోజనాల కోసమేనని బీఆర్ఎస్ నేతలు కౌంటర్ ఇచ్చారు. అవినీతిని ప్రశ్నిస్తే సస్పెండ్ చేయడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమని మండిపడ్డారు.

సస్పెన్షన్ అనంతరం బయటకు వచ్చిన ఎమ్మెల్సీలు అసెంబ్లీ ప్రాంగణంలో నిరసన కొనసాగించారు. ప్రభుత్వ అవినీతి చిట్టాను బయటపెట్టే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. పొంగులేటి శ్రీనివాస రెడ్డి కంపెనీపై వస్తున్న ఆరోపణలు తీవ్రమైనవని, వీటిపై మౌనం వహించడం వెనుక మర్మమేంటని ప్రశ్నించారు. కేబినెట్ నుంచి మంత్రిని తొలగించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అక్రమ మైనింగ్ వల్ల ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల నష్టం వాటిల్లిందని గణాంకాలతో సహా వివరించారు. దీనిపై ప్రభుత్వం ఎందుకు భయపడుతోందో అర్థం కావడం లేదని వారు ఎద్దేవా చేశారు. నిజాయితీ ఉంటే హౌస్ కమిటీకి ఎందుకు అంగీకరించడం లేదని నిలదీశారు. శాసన సభలో కూడా ఆదివారం ఇదే అంశంపై పెద్ద యుద్ధమే జరిగింది. రాఘవ కన్‌స్ట్రక్షన్ అంశంపై విపక్షాలు పట్టుబట్టడంతో స్పీకర్ సభ్యులపై కఠిన చర్యలు తీసుకున్నారు. సభ నియమావళిని అతిక్రమించారనే సాకుతో వారిని సమావేశాల నుంచి బహిష్కరించారు. ప్రభుత్వం తన వాదనను బలంగా వినిపిస్తూ గత పదేళ్ల మైనింగ్ రికార్డులను తిరగదోడతామని చెబుతోంది. సీబీసీఐడీ విచారణతో అన్ని నిజాలు బయటకు వస్తాయని హోం శాఖ బాధ్యతలు చూస్తున్న నేతలు పేర్కొన్నారు. విచారణను ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కానీ విపక్షం కావాలనే డ్రామాలు చేస్తోందని మండిపడ్డారు. పాత అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని బీఆర్ఎస్ భయపడుతోందని విమర్శించారు. మండలిలో గందరగోళం మధ్యే ఆమోదం పొందిన తల్లిదండ్రుల పరిరక్షణ బిల్లు ఎంతో కీలకమైనది. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. ఇలాంటి ప్రాధాన్యత ఉన్న బిల్లు చర్చ లేకుండానే ఆమోదం పొందడంపై పౌర సమాజం ఆవేదన వ్యక్తం చేస్తోంది. విపక్షాల నిరసనలు ప్రజాస్వామ్య హక్కు అయినప్పటికీ, కీలక చర్చలు జరగాల్సిన సమయంలో సస్పెన్షన్లు రావడం దురదృష్టకరమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన విచారణకు విపక్షాలు ఎందుకు సహకరించడం లేదనే కోణంలోనూ చర్చ జరుగుతోంది. అధికార, విపక్షాల మధ్య కొనసాగుతున్న ఈ మాటల యుద్ధం రాష్ట్ర రాజకీయాల్లో మంటలు రేపుతోంది.

# కట్నం రక్కసి కోరల్లో ఆడ బిడ్డలు

**మొదటిపేజీ తరువాయి**



గడిచిన ఆరేళ్ల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 50 వేలకు పైగా వరకట్న వేధింపుల కేసులు నమోదు కావడం ఈ దురాచారం ఎంతలా వేళ్లూనుకుపోయిందో స్పష్టం చేస్తోంది. 2020 జనవరి నుంచి 2025 సెప్టెంబర్ వరకు తెలంగాణలో ఏకంగా 51,586 కేసులు రికార్డయ్యాయి. ఉమెన్ సేఫ్టీ వింగ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఈ ఏడాది సెక్షన్ 304బి కింద నమోదైన వరకట్న మరణాల కేసులు భారీగా పెరిగాయి. చదువుకున్న వారు, ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న వారు సైతం అదనపు కట్నం కోసం భార్యలను వేధించడం నేటి విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది. సామాజిక మార్పు రానంత వరకు చట్టాలు ఎన్ని ఉన్నా ఫలితం శూన్యమని ఈ ఉదంతాలు నిరూపిస్తున్నాయి. వరకట్న మరణాల పెరుగుదలపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సైతం ఘాటుగా స్పందించింది. ఇటువంటి ఘటనలు అత్యంత దారుణమని, ఇవి ఆధునిక సమాజానికి చెరగని మచ్చలని న్యాయమూర్తులు జె.బి. పార్థీవాలా, విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. వరకట్న నిషేధ చట్టం అమలులో ఉన్నప్పటికీ, తెర వెనుక ఈ దందా నిరాటంకగా సాగడం చట్టాల వైఫల్యంగా భావించాల్సి ఉంటుంది. వేలాది మంది మహిళలు అకాల మరణం చెందడం అమానుషమని కోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. శిక్షలు కఠినంగా ఉన్నప్పుడే నేరస్థుల్లో భయం పుడుతుందని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికల ప్రకారం 2023లో దేశవ్యాప్తంగా నేరాలు 14 శాతం పెరిగాయి. ఆ ఏడాది ఒక్క సంవత్సరంలోనే 15,489 వరకట్న వేధింపుల కేసులు నమోదు కాగా, 6,156 మంది మహిళలు మృతి చెందారు. గతంతో పోలిస్తే గణాంకాలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నప్పటికీ, మరణాల సంఖ్య మాత్రం స్థిరంగా కొనసాగుతుండటం కలవరపరిచే అంశం. 2021లో 13,568 కేసులు నమోదు కాగా, 2022లో స్వల్పంగా తగ్గినా, మళ్లీ 2023లో కేసులు పెరగడం గమనార్హం. కేవలం చట్టం మీద ఆధారపడటమే కాకుండా, సామాజికంగా ప్రతి ఒక్కరిలో బాధ్యత పెరిగినప్పుడే ఈ మరణాలను అరికట్టడం సాధ్యమవుతుంది. దేశంలో సగటున ప్రతిరోజూ 20 మంది మహిళలు వరకట్నం కారణంగా ప్రాణాలు కోల్పోతుండటం విచారకరం. లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇచ్చిన సమాధానం ప్రకారం, 2017 నుంచి 2021 వరకు 35 వేలకు పైగా మరణాలు సంభవించాయి. 2022లో 6,400 మరణాలు, 2023లో 6,100కి పైగా కేసులు నమోదయ్యాయి. అంటే ప్రతీ గంటకూ ఒక మహిళ కట్నం వేధింపులతో బలి అవుతోందని ఈ లెక్కలు చెబుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశంగా చెప్పుకుంటున్న తరుణంలో మహిళలకు కనీస రక్షణ కరువవ్వడం గర్హనీయం. ఆడపిల్ల పుడితే భారం అనుకునే స్థితి నుంచి, ఆమెను వేధించి సంపాదించుకోవాలనే దుస్థితికి సమాజం చేరుకుంది.

తెలుగు రాష్ట్రాల పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తే చట్టాల అమలులో ఉన్న లొసుగులు బయటపడుతున్నాయి. తెలంగాణలో 2021లో కేవలం 5 వరకట్న కేసులు మాత్రమే నమోదు కాగా, మరణించిన వారి సంఖ్య 175గా ఉంది. అలాగే 2023లో 4 కేసులు నమోదు అయితే మరణాలు మాత్రం 145గా ఉన్నాయి. అంటే నేరాలు జరుగుతున్నప్పటికీ, వాటిని సరైన సెక్షన్ల కింద నమోదు చేయడంలో జాప్యం జరుగుతోందని అర్థమవుతోంది. వరకట్న మరణాలను సాధారణ మరణాలుగా లేదా ఆత్మహత్యలుగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. దీనివల్ల నిందితులకు శిక్షలు పడకుండా తప్పించుకునే అవకాశం దక్కుతోంది. ప్రస్తుత తరం యువత ఆలోచనల్లో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వివాహం అనేది రెండు మనసుల కలయిక అని కాకుండా, అదొక వ్యాపార లావాదేవీగా మారిపోయింది. భారీగా కట్నకానుకలు డిమాండ్ చేయడం ఒక హోదాగా భావించడం వల్ల మధ్యతరగతి కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. తల్లిదండ్రులు తమ కుమార్తెలకు ఆస్తుల కంటే ఆత్మవిశ్వాసాన్ని, విద్యాబుద్ధులను ఆస్తిగా ఇవ్వాలి. అదే సమయంలో అత్తవారింట్లో వేధింపులు ఎదురైనప్పుడు మౌనంగా భరించకుండా ఎదురు తిరిగే ధైర్యాన్ని నూరిపోయాలి. వేధింపుల ప్రారంభ దశలోనే పోలీసులను ఆశ్రయించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పుకునే వీలుంటుంది. ప్రభుత్వాలు కేవలం చట్టాలు చేసి చేతులు దులుపుకోకుండా, వాటి అమలు తీరును నిరంతరం పర్యవేక్షించాలి. షీ టీమ్స్ వంటి వ్యవస్థలు ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు వీటిపై అవగాహన తక్కువగా ఉంది. వరకట్న వేధింపుల కేసులను డీల్ చేసేటప్పుడు పోలీసులు మరింత సున్నితంగా వ్యవహరించాలి. బాధితులకు తక్షణ సహాయం అందించేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. వేధింపులకు పాల్పడే వారికి సమాజంలో బహిష్కరణ వంటి చర్యలు చేపడితేనే మార్పు మొదలవుతుంది. రాజకీయ నాయకులు సైతం ఇటువంటి కేసుల్లో జోక్యం చేసుకోకుండా నిష్పాక్షిక విచారణకు సహకరించాలి. న్యాయ వ్యవస్థలో కేసుల విచారణ ఏళ్ల తరబడి సాగడం వల్ల బాధితుల కుటుంబాలకు న్యాయం ఆలస్యమవుతోంది. నిందితులు బెయిల్‌పై బయటకు వచ్చి సాక్షులను బెదిరించే అవకాశాలు ఉన్నాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా ఇటువంటి కేసులను త్వరగా పరిష్కరించి, కఠిన శిక్షలు అమలు చేయాలి. నేరం చేసిన వారికి ఉరిశిక్ష లేదా యావజ్జీవ కారాగార శిక్ష పడుతుందనే భయం ఉన్నప్పుడే నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుంది. చట్టం పట్ల నమ్మకం పెరిగినప్పుడే బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తారు. సామాజిక న్యాయం అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ఆచరణలో కనిపించాలి. విద్యాసంస్థలు విద్యార్థులకు నైతిక విలువలను బోధించాలి. చిన్నతనం నుంచే ఆడపిల్లలను గౌరవించడం నేర్పించాలి. వరకట్నం తీసుకోవడం నేరమని, అది సామాజికంగా ఒక చీడపురుగు వంటిదని అవగాహన కల్పించాలి. యువకులు తాము కట్నం తీసుకోమని ప్రతిజ్ఞ చేయాలి. అప్పుడే ఈ వ్యవస్థలో వేగంగా మార్పు వస్తుంది. పెళ్లి పేరుతో అమ్మాయిలను కొనుగోలు చేసే సంస్కృతికి స్వస్తి పలకాలి. ఆడపిల్లలను ఆర్థికంగా స్వతంత్రులను చేయడం ద్వారా వారిపై దాడులను అరికట్టవచ్చు. సమాజంలోని ప్రతి పౌరుడు ఈ పోరాటంలో భాగస్వామి కావాలి. నిత్యం పెరుగుతున్న మరణాల సంఖ్య మన వ్యవస్థలోని వైఫల్యాలను ఎత్తిచూపుతోంది. ఆడబిడ్డల కన్నీళ్లు తుడువలేని అభివృద్ధి ఎంత ఉన్నా అది వృధా. వరకట్నం లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి. చట్టాలు, ప్రభుత్వం, సమాజం కలిసికట్టుగా పనిచేసినప్పుడే అబలలు సబలలుగా మారతారు. ప్రాణాలు కోల్పోతున్న మహిళల సంఖ్య సున్నాకు చేరిన రోజే నిజమైన ప్రజాస్వామ్యానికి సార్థకత లభిస్తుంది. భవిష్యత్తు తరాలకు గౌరవప్రదమైన, వివక్ష లేని సమాజాన్ని అందించడం మనందరి ప్రాథమిక బాధ్యత. ఈ దిశగా అడుగులు వేయడం ఇక ఎంతమాత్రం ఆలస్యం చేయకూడదు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బంపర్ ఆఫర్

- **ఇందిరమ్మ ఇళ్లు పూర్తి కాకపోయినా తుది బిల్లులు విడుదల**
- **నేల పని, లోపలి ప్లాస్టరింగ్ లేకున్నా డబ్బులు చెల్లింపు**
- **పూర్తిస్థాయి ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు లేకున్నా ఓకే**
- **కేవలం మెయిన్ డోర్ ఉంటే చాలు.. లోపలివి అక్కర్లేదు**
- **బయట వైట్ వాష్ ఉంటే సరిపోతుంది.. రెండో కోట్ అవసరం లేదు**
- **చిన్న పనుల కోసం నిధులు ఆపవద్దని కలెక్టర్లకు ఆదేశం**



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్రంలో గూడు లేని పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులకు ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను తొలగిస్తూ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ఇల్లు వంద శాతం పూర్తి కాకపోయినా నివాసయోగ్యంగా ఉంటే చాలు తుది విడత బిల్లులు విడుదల చేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉన్న కఠిన నిబంధనల వల్ల వేలాది మంది పేదలు ఇల్లు పూర్తయినా ఆర్థిక స్థోమత లేక చిన్న చిన్న పనులను పూర్తి చేయలేక ప్రభుత్వ సాయం కోసం వేచి చూడాల్సి వచ్చేది. ఈ పరిస్థితిని గమనించిన హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ క్షేత్రస్థాయిలో నిబంధనలను సవరించారు. దీనివల్ల గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్న వేలాది కుటుంబాలకు తక్షణమే ఆర్థిక వెసులుబాటు కలగనుంది. గతంలో అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఇంటి లోపల ఫ్లోరింగ్, ప్లాస్టరింగ్ సహా పూర్తిస్థాయి విద్యుత్ వైరింగ్ పనులు ముగిస్తేనే కంప్లీషన్ స్టేజ్ ఫొటోలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే అవకాశం ఉండేది. ఆ ఫొటోలు ఉంటేనే తుది విడత బిల్లును ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేది. అయితే నిరుపేద లబ్ధిదారులు ఇంటి స్లాబ్ వరకు అప్పులు చేసి నిర్మించుకున్నాక, లోపలి హంగుల కోసం మరిన్ని నిధులు సమకూర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఫినిషింగ్ పనులు ఆగిపోవడంతో ప్రభుత్వం నుంచి రావాల్సిన చివరి విడత నగదు నిలిచిపోయి వారిపై ఆర్థిక భారం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మానవీయ కోణంలో ఆలోచించిన సర్కారు నివాసానికి ఇల్లు సిద్ధంగా ఉంటే చాలు అన్నట్లుగా మార్గదర్శకాలను మార్చింది. సవరించిన కొత్త నిబంధనల ప్రకారం ఇకపై ఇంటి లోపల ఫ్లోరింగ్ పని పూర్తి కాకపోయినా బిల్లులు ఆపకూడదని స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి. లబ్ధిదారులు తమ వద్ద ఉన్న నిధులను బట్టి భవిష్యత్తులో ఈ నేల పనులను పూర్తి చేసుకునే వెసులుబాటు కల్పించారు. అలాగే ఇంటి వెలుపలి వైపు ప్లాస్టరింగ్ పూర్తయితే సరిపోతుందని, లోపలి వైపు గదులకు ప్లాస్టరింగ్ లేకపోయినా తుది విడత బిల్లు మంజూరు చేయాలని అధికారులు నిర్ణయించారు. చాలా మంది పేదలు లోపల గదులకు ప్లాస్టరింగ్ చేయించుకోలేక ప్రభుత్వం ఇచ్చే చివరి విడత నగదు కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న తరుణంలో ఈ నిర్ణయం వారికి పెద్ద ఊరటగా మారింది. ఇంటి తలుపులు, కిటికీల విషయంలోనూ ప్రభుత్వం నిబంధనలను భారీగా సడలించింది. గతంలో అన్ని గదులకు తలుపులు ఉండాలనే నియమం ఉండగా ఇప్పుడు కేవలం ఇంటి ప్రధాన ద్వారం ఉంటే సరిపోతుందని వెల్లడించారు. లోపలి గదులకు తలుపులు లేకపోయినా బిల్లులు చెల్లించవచ్చని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. అదేవిధంగా పెయింటింగ్ విషయంలోనూ వెలుపలి వైపు కేవలం ఒక్క కోటు వైట్ వాష్ లేదా పెయింటింగ్ ఉంటే సరిపోతుందని, రెండో కోటు వేయాలనే నిబంధనను తొలగించారు. పేదలు తమ స్తోమతను బట్టి తర్వాత రంగులు వేయించుకునేలా స్వేచ్ఛను ఇచ్చారు. దీనివల్ల ఫినిషింగ్ ఖర్చులు తగ్గి లబ్ధిదారులపై భారం తగ్గుతుంది. విద్యుత్ వైరింగ్, ప్లంబింగ్ పనుల్లో సైతం సరళతర విధానాలను ప్రవేశపెట్టారు. పూర్తిస్థాయిలో అంతర్గత వైరింగ్ పనులు ముగియకపోయినా తాత్కాలికంగా విద్యుత్ కనెక్షన్ తీసుకునే ఏర్పాటు ఉంటే దానిని కంప్లీషన్ కిందనే పరిగణించనున్నారు.

# కేసీఆర్ లేకపోతే నేను లేను

**మొదటిపేజీ తరువాయి**

ఏ విధంగా వెలుగులోకి వచ్చాయో, కేసీఆర్ పాలనలోని లోపాల వల్లనే తన మంచి పనులు ప్రజలకు స్పష్టంగా అర్థమవుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విలక్షణమైన పోలిక ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్ణయాలను ఎండగడుతూనే, కేసీఆర్ ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొందని రేవంత్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. ఆయన్ను ఎవరైనా గృహ నిర్బంధం చేశారా లేక ఆయనే విశ్రాంతి తీసుకుంటున్నారా అనే కోణంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒక ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల మధ్య ఉండాల్సిన వ్యక్తి కనిపించకపోవడం వెనుక ఏదో మర్మం ఉందని ఆయన అనుమానించారు. పరిపాలనలో పారదర్శకత ఉండాలని ఆకాంక్షించే తమ ప్రభుత్వం, గత పాలకుల వలె కాకుండా ప్రజలకు చేరువగా ఉంటోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేసీఆర్ తో తనకు అసలు పోలికే లేదని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే తన లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజన అంశంపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ చేస్తున్న వ్యాఖ్యలను ముఖ్యమంత్రి తీవ్రంగా ఖండించారు. కేవలం ఉత్తర భారతదేశ ప్రయోజనాల కోసమే బీజేపీ ఈ దిశగా అడుగులు వేస్తోందని ఆయన ఆరోపించారు. ఒకవేళ జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు జరిగితే దక్షిణ భారతదేశం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు కుటుంబ నియంత్రణ పాటించి, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాలను ఈ నిర్ణయం శిక్షించినట్లు అవుతుందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం దేశ సమగ్రతను దెబ్బతీయవద్దని ఆయన హితవు పలికారు. తెలంగాణలో రాష్ట్రపతి పాలన విధిస్తామంటూ బీజేపీ నేతలు చేస్తున్న హెచ్చరికలపై



రేవంత్ రెడ్డి గట్టిగా బదులిచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేని నిబంధనలు ఇక్కడ ఎందుకు వర్తిస్తాయని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని, వితండవాదంతో కాలక్షేపం చేయవద్దని సూచించారు. ఎంపీ లక్ష్మణ్ తన పదవికి రాజీనామా చేసి దక్షిణ భారత ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాడాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇది కేవలం ఒక పార్టీ సమస్య కాదని, యావత్ దక్షిణాది రాష్ట్రాల ఉనికికి సంబంధించిన విషయమని పేర్కొన్నారు.

రాజకీయంగా అవసరమైనప్పుడే దక్షిణాదిని వాడుకుని, సీట్ల పంపకం వచ్చేసరికి అన్యాయం చేయడం సరికాదని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఉత్తరాది రాష్ట్రాలకు లబ్ధి చేకూర్చేలా నియోజకవర్గాల విభజన ఉంటే దక్షిణ భారతదేశం తన రాజకీయ ప్రాధాన్యతను కోల్పోతుందని ఆవేదన చెందారు. ఇలాంటి వివక్షాపూరిత నిర్ణయాల వల్ల దేశంలో ప్రాంతీయ అసమానతలు పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నించే క్రమంలో ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్నారని బీజేపీపై విమర్శలు గుప్పించారు. నియంతృత్వ పోకడలను అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, అందుకే తాను కేరళ ఎన్నికల ప్రచారంలో ఈ అంశాలను గట్టిగా వినిపిస్తానని తెలిపారు. ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే భారీ స్థాయిలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రతి గడపకూ వైద్య సేవలు అందాలనేది తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తూనే, రైతులపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాబోమని హామీ ఇచ్చారు. పంట మార్పిడి లాంటి అంశాల్లో రైతులకు కేవలం అవగాహన కల్పిస్తామని, వారి ఇష్టానుసారమే సాగు చేసుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. గతంలో 'వరి వేస్తే ఉరే' అన్న పరిస్థితుల నుంచి నేడు 'వరి వేస్తే బోనస్' ఇచ్చే స్థాయికి తెలంగాణను తీసుకువచ్చామని రేవంత్ రెడ్డి గర్వంగా ప్రకటించారు. పేదల సంక్షేమం విషయంలో తమ ప్రభుత్వం రాజీ పడబోదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సన్న బియ్యం పంపిణీ కోసం సుమారు పద్నాలుగు వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేస్తున్నామని, ఇందులో ఎలాంటి కోతలు ఉండవని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అసెంబ్లీలో సన్న బియ్యం భోజనం పెట్టి నాణ్యతను నిరూపించామని, గతంలో జరిగిన అక్రమాలకు తావులేకుండా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో మార్పు కనిపిస్తోందని, ప్రజల ముఖాల్లో చిరునవ్వు చూడటమే తమ అంతిమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. మహిళలకు ఎంతో ఊరటనిచ్చే ఐదు వందల రూపాయల గ్యాస్ సిలిండర్ పథకంలో ఎలాంటి మార్పులు లేవని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై వస్తున్న పుకార్లను నమ్మవద్దని కోరారు. కేంద్ర ప్రభుత్వం సెస్ పేరుతో రాష్ట్రం నుంచి భారీగా నిధులు వసూలు చేస్తోందని, కానీ తిరిగి ఇచ్చేటప్పుడు మాత్రం వివక్ష చూపుతోందని ఆరోపించారు. రాష్ట్రం నుంచి వెళ్లే నిధుల్లో కేవలం ముప్పై నాలుగు శాతం మాత్రమే తిరిగి వస్తుండటం దారుణమని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే నిధులు మళ్లించడం వల్ల తెలంగాణ వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆయన వివరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో మీడియా పాత్ర కీలకమని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతతో రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రజాపాలనలో భాగంగా అందిస్తున్న ప్రతి పథకం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరించాలని విజ్ఞప్తి చేశారు. తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టడంలో మీడియా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ ప్రభుత్వం తీసుకుంటున్న సాహసోపేతమైన నిర్ణయాలు ప్రజలకు చేరినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్ముతున్నట్లు చెప్పారు. బాధ్యతాయుతమైన జర్నలిజం సమాజ మార్పుకు దోహదపడుతుందని రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పోవడమే తమ విధానమని, అందుకే అట్టడుగు వర్గాలకు రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు దక్కేలా చూస్తామని రేవంత్ రెడ్డి చెప్పారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక సమానత్వం కోసం పనిచేస్తామని వివరించారు. మతం కంటే కులమే బలమైన శక్తిగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో, అణగారిన వర్గాల హక్కుల రక్షణే తమ ప్రాధాన్యత అని ప్రకటించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులాలను విడదీయడం తమకు చేత కాదని, అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే తమ మార్గమని చెప్పారు. ఈ క్రమంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటామని, ప్రజల మద్దతు తమకు ఎప్పుడూ ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

# ప్రజాస్వామ్య గొంతుకను నొక్కేందుకే 'హేట్ స్పీచ్'

**మొదటిపేజీ తరువాయి**

బాధ్యతగా చెబుతున్నా, బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని విమర్శించారు. అమలు యంత్రాంగం నిష్పాక్షికంగా వ్యవహరించే అవకాశం లేదని, అధికారుల వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు ప్రాధాన్యత ఇచ్చేలా ఈ చట్ట రూపకల్పన జరిగిందని ఆయన ఆరోపించారు. ఇది కచ్చితంగా రాజకీయ కక్షసాధింపు చర్యలకు, దుర్వినియోగానికి దారితీస్తుందని స్పష్టం చేశారు. బిల్లులో పొందుపరిచిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం', 'సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ పరిమితులు లేవని కేటీఆర్ ఎత్తిచూపారు. వీటిని సాకుగా చూపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తనపై వచ్చే విమర్శలను తట్టుకోలేక, వాటిని 'ఫేక్ న్యూస్'గా ముద్రవేసి గొంతు నొక్కేందుకు చూస్తోందని ధ్వజమెత్తారు. ప్రశ్నించే వారిని జైలుకు పంపడమే ఈ చట్టం వెనుక ఉన్న అసలు ఆంతర్యమని బీఆర్ఎస్ నేత విశ్లేషించారు. గతంలో 'శ్రేయా సింఘల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. కేవలం ప్రత్యక్ష హింసకు ప్రేరేపించే మాటలపైనే నియంత్రణ ఉండాలని, విమర్శ లేదా వ్యంగ్యం ఏమాత్రం శిక్షార్హం కాదని కోర్టు స్పష్టంగా చెప్పిందని వివరించారు. ఈ లక్ష్మణ రేఖను దాటి చట్టాలు చేయడం ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తుంగలో తొక్కి ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడు నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షలను ప్రతిపాదించడం ద్వారా సామాన్య ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించాలని రేవంత్ ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ విమర్శించారు. జర్నలిస్టులు, విద్యార్థులు, మేధావులు తమ అభిప్రాయాలను పంచుకోవాలంటేనే భయపడేలా ఈ కఠిన శిక్షలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశంలో విద్వేష ప్రసంగాలపై పోరాడేందుకు తగినన్ని చట్టాలు అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు. అదనంగా ఇటువంటి అణచివేత చట్టం తీసుకురావడం వెనుక ఉన్న దురుద్దేశాలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. ప్రభుత్వ అస్తవ్యస్త నిర్ణయాలు, హామీల అమలులో వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇటువంటి ఎత్తుగడలు వేస్తున్నారని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియాలో చైతన్యవంతంగా వ్యవహరించే యువతను కట్టడి చేసేందుకు ఈ బిల్లును ఒక అస్త్రంగా వాడుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. సామాన్యుడి గొంతు వినబడకుండా చేయడమే ఈ కుట్రలోని ప్రధాన భాగమని ఆయన పేర్కొన్నారు. భావప్రకటన స్వేచ్ఛ లేని సమాజం నియంతృత్వానికి దారి తీస్తుందని, రేవంత్ సర్కార్ ఆ దిశగానే అడుగులు వేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛపై దాడి చేయడం సరికాదని కేటీఆర్ హితవు పలికారు. చట్టం అనేది ప్రజల రక్షణ కోసం ఉండాలి కానీ, పాలకుల అహంకారాన్ని సంతృప్తి పరిచేలా ఉండకూడదని అన్నారు. అస్పష్టమైన నిబంధనలతో కూడిన ఈ బిల్లు పోలీసులకు అపరిమితమైన అధికారాలను కట్టబెడుతుందని, దీనివల్ల అమాయకులు బలి అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎల్లప్పుడూ పోరాడుతుందని, ఇటువంటి నల్ల చట్టాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి ప్రభుత్వం కేవలం తన ఉనికిని కాపాడుకునేందుకు, విమర్శలను అణచివేసేందుకు ప్రాధాన్యత ఇస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి సారించకుండా, ప్రజల నోళ్లు ఎలా మూయించాలో ఆలోచించడం శోచనీయమన్నారు. ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అణచివేత ధోరణిని వీడి పారదర్శక పాలన అందించాలని సూచించారు. నిజానికి హేట్ స్పీచ్ నిర్వచనం అధికార పార్టీ నేతలకు కూడా వర్తించాలన్నారు. కానీ ఈ చట్టం కేవలం ప్రత్యర్థులను వేధించడానికే ఉపయోగపడుతుందన్నది సుస్పష్టమని కేటీఆర్ పేర్కొన్నారు. అధికార మదంతో చట్టాలను తమకు అనుకూలంగా మార్చుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజం ఎప్పుడూ స్వేచ్ఛను ఆకాంక్షిస్తుందని, బానిసత్వానికి తావు లేదని గుర్తు చేశారు. ఇటువంటి ప్రతిపాదనలు ప్రభుత్వం తన పతనాన్ని తానే కొనితెచ్చుకోవడమే అవుతుందని వ్యాఖ్యానించారు. చట్టసభల్లో చర్చించకుండా, ప్రజాభిప్రాయాన్ని సేకరించకుండా ఇటువంటి కీలక బిల్లులను తీసుకురావడం పాలకుల అహంకారానికి నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తును, పౌరుల హక్కులను పణంగా పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం దారుణమన్నారు. బీఆర్ఎస్ పక్షాన ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని, ప్రతి పౌరుడి హక్కును కాపాడే వరకు విశ్రమించబోమని ప్రకటించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ఈ వివాదాస్పద బిల్లుపై పునర్విమర్శ చేయాలని గట్టిగా కోరారు. తెలంగాణను ఒక నిఘా నీడలో ఉంచాలని చూస్తే ఊరుకోబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. భావప్రకటన స్వేచ్ఛపై సంకెళ్లు వేయడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం తన పంథాను మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే ఇటువంటి నిర్ణయాలపై మేధావులు, యువత మేల్కొని గొంతు ఎత్తాలని పిలుపునిచ్చారు. న్యాయ పోరాటం ద్వారా కూడా ఈ బిల్లును అడ్డుకుంటామని కేటీఆర్ తన ప్రకటనలో భరోసా ఇచ్చారు.



# ప్రశ్నించే గొంతుకపై దాడి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ గడ్డపై ప్రజాస్వామ్య స్ఫూర్తిని పరిరక్షించాల్సిన ప్రభుత్వం, పౌర హక్కుల గొంతు నులిమే దిశగా అడుగులు వేస్తోంది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ ప్రివెన్షన్ బిల్ - 2026' ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా తెరపైకి తెచ్చిన ఈ చట్టం, పైకి సామాజిక సామరస్యం పేరు చెబుతున్నా, అంతర్గతంగా ప్రతిపక్షాల విమర్శలను అణచివేసే ఆయుధంగా కనిపిస్తోంది. సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే సామాన్యులను సైతం జైలు ఊచల వెనక్కి నెట్టేలా రూపొందించిన ఈ నిబంధనలు అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తున్నాయి. ఈ నూతన చట్టంలోని శిక్షా స్మృతిని పరిశీలిస్తే పాలకుల అసలు ఉద్దేశం స్పష్టమవుతోంది. సోషల్ మీడియాలో పోస్టుల పేరుతో ఎవరినైనా లక్ష్యంగా చేసుకుంటే ఏడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించేలా నిబంధనలు చేర్చారు. మొదటిసారి పొరపాటు చేసినా సరే, రూ.50,000 జరిమానాతో పాటు దీర్ఘకాలిక జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ఒకవేళ రెండోసారి అదే తరహా విమర్శలు చేస్తే ఏకంగా పదేళ్ల శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తామనడం పౌర సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఇక్కడ ఏది విద్వేషపూరిత ప్రసంగం, ఏది రాజకీయ విమర్శ అనే అంశంపై స్పష్టత లేకపోవడం వల్ల అధికార పార్టీకి నచ్చని ప్రతి పోస్టు నేరంగా మారే ప్రమాదం ఉంది. ప్రభుత్వ యంత్రాంగం ఈ నేరాలను 'నాన్‌బెయిలబుల్'గా పరిగణించాలని నిర్ణయించడం అత్యంత దుర్మార్గమైన చర్యగా మేధావులు అభివర్ణిస్తున్నారు. అంటే ఒకసారి కేసు నమోదైతే కోర్టుల ద్వారా ఉపశమనం పొందేలోపే బాధితులు తీవ్ర వేధింపులకు గురవుతారు. విచారణ పేరుతో పోలీసులను ప్రయోగించి సామాన్యుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించడం ద్వారా సోషల్ మీడియాలో ఎవరూ నోరు మెదపకుండా చేయడమే ఈ బిల్లు పరమార్థంలా కనిపిస్తోంది. రాజ్యాంగం కల్పించిన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను రాష్ట్రప్రభుత్వం కాలరాస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బాధితులకు పరిహారం ఇస్తామనే నెపంతో ప్రభుత్వం ఒక వింతైన వ్యవస్థను రూపొందించింది. విద్వేషపూరిత పోస్టుల వల్ల నష్టం జరిగిందని ఎవరైనా ఫిర్యాదు చేస్తే, వారికి నిందితుల నుంచి డబ్బులు



వసూలు చేసి ఇప్పించే వెసులుబాటు కల్పించారు. దీనివల్ల అధికార పార్టీ కార్యకర్తలు తమపై వచ్చే విమర్శలను హేట్ స్పీచ్‌గా చిత్రీకరించి, పరిహారం పేరుతో లబ్ధి పొందే అవకాశం ఉంది. కోర్టులు శిక్ష ఖరారు చేయకముందే ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు డిజిటల్ నెట్‌వర్క్‌లపై ఆంక్షలు విధించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. కేవలం వ్యక్తులనే కాకుండా సంస్థలను, వాటి నిర్వాహకులను కూడా ఈ చట్టం పరిధిలోకి తేవడం వెనుక పెద్ద వ్యూహం దాగి ఉంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం ఎత్తే యూట్యూబ్ ఛానళ్లు, డిజిటల్ మీడియా సంస్థలను లక్ష్యంగా చేసుకునేందుకే ఈ నిబంధన తెచ్చారు. ఏదైనా ఒక చిన్న పొరపాటు జరిగినా ఆ సంస్థలోని మేనేజర్లు, కీలక వ్యక్తులందరినీ బాధ్యులను చేస్తూ అరెస్టులు చేసే అధికారం పోలీసులకు దక్కుతుంది. ఇది నేరుగా పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడి అని, విమర్శనాత్మక కథనాలను అడ్డుకోవడమే దీని లక్ష్యమని స్పష్టమవుతోంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా అనేది ప్రజా సమస్యలను ప్రతిబింబించే అద్దంలా మారింది. ప్రభుత్వం చేసే తప్పులను ఎండగట్టే వేదికగా ఉన్న ఈ మాధ్యమాన్ని నియంత్రించాలని చూడటం ప్రజాస్వామ్యానికి చేటు కలిగిస్తుంది. గతంలో విపక్షంలో ఉన్నప్పుడు సోషల్ మీడియా పోస్టులను అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందిన వారే, నేడు అధికారంలోకి రాగానే కఠిన చట్టాలను తీసుకురావడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనం. ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాల్సింది పోయి, భయపెట్టి పాలించాలని చూడటం విచారకరం. రాజకీయ విమర్శలను సైతం హేట్ స్పీచ్ కింద జమకట్టే అధికారం ప్రభుత్వ అధికారుల చేతుల్లో ఉండటం ఆందోళన కలిగించే విషయం. కులం, మతం పేరుతో చిచ్చు పెట్టేవారిని శిక్షించడంలో ఎవరికీ అభ్యంతరం లేదు కానీ, పాలకుల అసమర్థతను ప్రశ్నించే వారిపై ఈ చట్టాన్ని ప్రయోగించే అవకాశం మెండుగా ఉంది. సామాన్య పౌరుడు తన వేదనను సోషల్ మీడియాలో పంచుకోవాలన్నా పది సార్లు ఆలోచించాల్సిన పరిస్థితిని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించింది. ఇది పాలనలో సంస్కరణ కాదు, ప్రశ్నించే గొంతుపై ఉక్కుపాదం మోపడమే. రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగం, రైతుల సమస్యలు, ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి వివాదాస్పద బిల్లులను తెరపైకి తెస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలు తమ కష్టాలను చెప్పుకుంటే అవి విద్వేషపూరిత వ్యాఖ్యలుగా కనిపిస్తున్నాయా అని యువత ప్రశ్నిస్తోంది. విమర్శలను స్వీకరించలేని తత్వం ప్రజాస్వామ్య పాలకులకు తగదు. అణచివేత పెరిగే కొద్దీ ప్రతిఘటన కూడా అంతే స్థాయిలో ఉంటుందనే చారిత్రక సత్యాన్ని ప్రభుత్వం విస్మరించినట్లు కనిపిస్తోంది. డిజిటల్ నిఘా పేరుతో ప్రభుత్వం నియమించే అధికారులు పక్షపాతంతో వ్యవహరించే ప్రమాదం ఉంది. కేవలం ప్రతిపక్ష మద్దతుదారుల పోస్టులను మాత్రమే తొలగించడం, అధికార పార్టీకి అనుకూలంగా ఉండే అభ్యంతరకర పోస్టులను వదిలేయడం వంటి సంఘటనలు ఇప్పటికే జరుగుతున్నాయి. ఇప్పుడు ఈ చట్టం తోడైతే పోలీసు యంత్రాంగం పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసం వాడబడుతుందనేది నగ్న సత్యం. బాధితులకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే, మొదట వ్యవస్థలోని వివక్షను తొలగించాలి.



# హేట్ స్పీచ్ బిల్లుతో కాంగ్రెస్‌కే ఇబ్బంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ శాసనసభ వేదికగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'విద్వేష ప్రసంగాలు, నేరాల నిరోధక బిల్లు 2026' రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతోంది. ప్రజాస్వామ్య విలువలకే తలవంపులు తెచ్చేలా ఉన్న ఈ బిల్లుపై ప్రతిపక్ష బీజేపీ విరుచుకుపడింది. ముఖ్యంగా బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అసెంబ్లీలో సర్కారు తీరును తీవ్రంగా ఎండగట్టారు. పౌర హక్కులను కాలరాస్తూ, ప్రశ్నించే గొంతుకలపై ఉక్కుపాదం మోపేలా ఈ బిల్లును రూపొందించడం దురదృష్టకరమని ఆయన మండిపడ్డారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వారు రేపు ప్రతిపక్షంలో కూర్చున్నప్పుడు ఇదే చట్టం వారిని కూడా వెంటాడుతుందని హెచ్చరించారు. రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడిచేలా ఉన్న ఈ ముసాయిదాపై సభలో వాడివేడి చర్చ జరిగింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 పౌరులకు కల్పించిన ప్రాథమిక స్వేచ్ఛను ఈ బిల్లు పూర్తిగా హరించివేసేలా ఉంది. శాంతిభద్రతల పరిరక్షణ సాకుతో ప్రభుత్వం తన రాజకీయ ప్రత్యర్థుల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని మహేశ్వర్ రెడ్డి నిప్పులు చెరిగారు. బిల్లులో ఉన్న అస్పష్టమైన నిర్వచనాలు అధికారులకు అపరిమితమైన అధికారాలను కట్టబెడుతున్నాయి. ఇది చివరకు నియంతృత్వ పోకడలకు దారితీసే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య పౌరుడు ప్రభుత్వంపై విమర్శ చేసినా, సోషల్ మీడియాలో నిలదీసినా దాన్ని నేరంగా పరిగణించే వెసులుబాటు ఈ చట్టంలో ఉండటం ఆందోళనకరం. ఒక వ్యక్తి మాట్లాడిన తీరు దురభిప్రాయం కలిగించిందని భావిస్తే చాలు, వారిని జైల్లో పెట్టేందుకు సెక్షన్ 2(1) వీలు కల్పిస్తోంది. పాలనలో వైఫల్యాలను ఎత్తిచూపితే దాన్ని విద్వేష ప్రసంగంగా ముద్రవేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. రోడ్ల దుస్థితిపై పోస్టు పెట్టినా, మంత్రుల పనితీరును విమర్శించినా పోలీసులకు అరెస్ట్ చేసే అధికారాలు ఇవ్వడం వెనుక కుట్ర దాగి ఉంది. చట్టం అనేది ప్రజల రక్షణ కోసం ఉండాలి కానీ, పాలకుల కక్ష సాధింపు చర్యలకు ఆయుధంగా మారకూడదు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను ఈ బిల్లు పాతిపెడుతోంది. పాలకుల తప్పులను ప్రశ్నిస్తే హేట్ స్పీచ్ కింద కేసులు పెట్టడం చూస్తుంటే ప్రభుత్వం ఎంతటి అభద్రతా భావంతో ఉందో అర్థమవుతోంది. ప్రజాస్వామ్యంలో విమర్శను స్వీకరించాల్సింది పోయి, బేడీలు వేయాలనుకోవడం దారుణం. మరణించిన వ్యక్తులపై వ్యాఖ్యలు చేసినా అరెస్టు చేస్తామని బిల్లులో చేర్చడం హాస్యాస్పదంగా ఉంది. చరిత్రను విశ్లేషించే వారు లేదా గత పాలకుల విధానాలను ఎండగట్టే వారిపై కూడా కేసులు పెట్టే అవకాశం ఉంది. రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీ వంటి నాయకుల మీద మాట్లాడితే అది విద్వేష ప్రసంగం ఎలా అవుతుందని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. నిజాం కాలం నాటి పరిస్థితులపై వ్యాఖ్యానించినా, ఏదైనా వ్యాసం రాసినా కూడా దాన్ని హేట్ స్పీచ్‌గా పరిగణించి రచయితలను జైలుకు పంపే అధికారం పోలీసులకు దక్కుతోంది. ఇలాంటి నిబంధనలు విజ్ఞాన సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేసేలా ఉన్నాయి. ఇది కేవలం పాత జ్ఞాపకాలను తుడిచిపెట్టే ప్రయత్నమే కాదు, భిన్నాభిప్రాయాలను అణచివేయడమే. బిల్లులోని సెక్షన్ 3 అత్యంత ప్రమాదకరంగా మారింది. దీని కింద నమోదయ్యే కేసులు నాన్‌బెయిలబుల్ కావడం వల్ల రాజకీయ కక్ష సాధింపులకు ఇది కేరాఫ్ అడ్రస్‌గా మారుతుంది. అధికార పార్టీ నేతలు ఫిర్యాదు చేస్తే చాలు, పోలీసులు విచక్షణ లేకుండా అరెస్టు చేసే అవకాశం ఉంది. నింద రుజువు కాకముందే ఒక వ్యక్తిని జైల్లో ఉంచడం అంటే రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛకు విఘాతం కలిగించడమే. బాధితుడు తాను చేసిన తప్పు ఏమిటో తెలియకుండానే కటకటాల వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టేందుకు ఈ సెక్షన్‌ను ప్రభుత్వం ఒక ఆయుధంగా వాడుకోబోతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సెక్షన్ 4 కింద ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్లకు అపరిమిత అధికారాలు కట్టబెట్టారు. ఒక వ్యక్తిని ఒకసారి అరెస్టు చేసి విడుదల చేసినా, మళ్లీ అనుమానంతో పట్టుకునే వెసులుబాటు కల్పించడం అంటే అది రౌడీషీట్ ఓపెన్ చేయడమే. ఈ సెక్షన్ అమలులోకి వస్తే ముందస్తు బెయిల్ పొందే అవకాశం కూడా ఉండదు.

# కాంగ్రెస్, నక్సల్ భాయీ.. భాయీ..!

**విశాలభారతి, జాతీయం:**



దేశంలో నక్సలిజం అడ్రస్ లేకుండా పోయిందని, ఆయుధాలు పట్టి రాజ్యహింసకు పాల్పడే వారిని కేంద్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. లోక్‌సభలో నక్సలిజం నిర్మూలనపై జరిగిన చర్చలో ఆయన సుదీర్ఘంగా ప్రసంగిస్తూ మావోయిస్టులకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో ఒకప్పుడు అజేయంగా వెలుగొందిన నక్సలిజం ఇప్పుడు నామరూపాలు లేకుండా పోయిందని వెల్లడించారు. అడవుల్లో తుపాకులు పట్టుకుని తిరిగే వారంతా ఆయుధాలు విడిచిపెట్టి సాధారణ పౌరులుగా జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగానికి మించిన శక్తి లేదని, సమస్యలు ఏవైనా ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి తప్ప ప్రాణాలు తీయడం మార్గం కాదని హితవు పలికారు. గత ఆరు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో ఆదివాసీల జీవితాల్లో ఎలాంటి సానుకూల మార్పులు రాలేదని అమిత్ షా విమర్శలు గుప్పించారు. నక్సలిజం విస్తరించడానికి, వేళ్లూనుకోవడానికి కాంగ్రెస్ అనుసరించిన బలహీన విధానాలే కారణమని ఆరోపించారు. దేశంలో మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకు పాకడానికి ఇందిరాగాంధీ హయాంలో జరిగిన పరిణామాలే పునాది అని విశ్లేషించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే గిరిజన కుగ్రామాల్లో సైతం మౌలిక వసతుల కల్పన వేగవంతమైందని వివరించారు. మారుమూల ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రభుత్వం ప్రజలకు దగ్గరైందని పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలు అందుతుండటంతో గిరిజన యువత ఇప్పుడు తుపాకులకు దూరంగా జరిగి ఉపాధి మార్గాలను అన్వేషిస్తున్నారని సభకు వివరించారు. నక్సలైట్లు వినియోగిస్తున్న ఆయుధాల్లో సగానికి పైగా భద్రతా బలగాల నుంచి దోచుకున్నవేనని హోంమంత్రి గణాంకాలతో సహా వెల్లడించారు. పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి, అమాయక సిబ్బందిని పొట్టనపెట్టుకుని ఆయుధాలను ఎత్తుకెళ్లడం ఏ రకమైన సిద్ధాంతమో చెప్పాలని నిలదీశారు. ప్రజల ప్రాణాలు తీసే హక్కు నక్సల్స్‌కు ఎక్కడి నుంచి వచ్చిందని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేశారు. పాఠశాలలు, బ్యాంకులు, ఆసుపత్రులు వంటి ప్రజా ఆస్తులను తగులబెట్టే వారు అభివృద్ధిని ఎలా కాంక్షిస్తారని ప్రశ్నించారు. విదేశీ సిద్ధాంతాలను దిగుమతి చేసుకుని దేశాభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న మావోయిస్టులకు భారతీయులు ఎవరూ ఆదర్శం కాదని, వారికి కేవలం చైనా నేత మావో మాత్రమే మార్గదర్శి అని ఎద్దేవా చేశారు. మావోయిస్టులను భగత్ సింగ్, బిర్సా ముండా వంటి మహనీయులతో పోల్చడం దేశద్రోహమే అవుతుందని అమిత్ షా మండిపడ్డారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులకు, అమాయక ప్రజలను పొట్టనపెట్టుకునే నక్సలైట్లకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని వ్యాఖ్యానించారు. నక్సలైట్లు తమ ఉనికిని కాపాడుకోవడానికే ఇప్పుడు పోరాడుతున్నారని, వారి ఎజెండాలో ప్రజల సంక్షేమం అనేది ఎక్కడా లేదని కొట్టిపారేశారు. సాయుధ పోరాటాల ద్వారా అధికారాన్ని చేజిక్కించుకోవచ్చనే భ్రమల నుంచి వారు బయటకు రావాలని సూచించారు. ఇది నరేంద్ర మోదీ ప్రభుత్వమని, దేశ సార్వభౌమాధికారానికి ముప్పు కలిగిస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఆయుధాలు పట్టుకునే వారిపై ఉక్కుపాదం మోపుతామని, ఇందులో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

అడవి బిడ్డలైన గిరిజన యువత జీవితాలను నక్సలైట్లు చిన్నాభిన్నం చేశారని అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లల చేతుల్లో పుస్తకాలకు బదులు తుపాకులు పెట్టి వారి భవిష్యత్తును అంధకారం చేశారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నిరక్షరాస్యత కొనసాగడానికి నక్సలైట్లే ప్రధాన కారకులని, విద్యా వ్యవస్థను వారు వ్యవస్థీకృతంగా ధ్వంసం చేశారని పేర్కొన్నారు. రహదారులు నిర్మిస్తే పోలీస్ వాహనాలు వస్తాయనే నెపంతో అభివృద్ధిని అడ్డుకున్నారని దుయ్యబట్టారు. గిరిజన ప్రాంతాల్లో వెలుగులు నింపేందుకు తమ ప్రభుత్వం రూ.4 వేల కోట్లతో మౌలిక వసతులు కల్పించిందని తెలిపారు. ఏకలవ్య పాఠశాలలు, ఐటీఐలు, ఆసుపత్రుల నిర్మాణంతో గిరిజన ప్రాంతాల రూపురేఖలు మారుస్తున్నామని వివరించారు. చైనా నుంచి దిగుమతైన మావోయిస్టు సిద్ధాంతం భారతీయ మూలాలకు విరుద్ధమని హోంమంత్రి అభిప్రాయపడ్డారు. రష్యాలో కమ్యూనిజం వచ్చిన తర్వాత భారత్‌లో సీపీఐ ఏర్పడిందని, ఆ తర్వాత విచ్ఛిన్నం చెందుతూ అనేక గ్రూపులుగా విడిపోయాయని గుర్తు చేశారు. దేశంలో ఇన్ని వామపక్ష పార్టీలు ఉండాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. 2004లో ఏర్పడిన మావోయిస్టు పార్టీ కేవలం హింసనే నమ్ముకుందని, లక్షలాది మంది తల్లులకు గర్భశోకం మిగిల్చిందని వాపోయారు. నక్సలైట్లను సమర్థించే వారికి కనీస మానవత్వం లేదని విమర్శించారు. కాంబోడియా, పెరూ వంటి దేశాల్లో జరిగిన రక్తపాతం మావోయిస్టు సిద్ధాంతాల వల్లే సంభవించిందని, భారత్‌లో అలాంటి పరిస్థితి రానివ్వబోమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో నక్సలిజం అదుపులోకి రావడానికి రాష్ట్ర పోలీసులతో కలిసి కేంద్ర బలగాలు చేసిన పోరాటం అమోఘమని అమిత్ షా ప్రశంసించారు. ఆపరేషన్ ఆక్టోపస్, ఆపరేషన్ చక్రబంధ్, ఆపరేషన్ థండర్‌స్టార్మ్ వంటి వ్యూహాత్మక దాడుల వల్ల మావోయిస్టుల నెట్‌వర్క్ దెబ్బతిన్నదని వెల్లడించారు. గడిచిన మూడేళ్లలో 4 వేల మందికి పైగా నక్సలైట్లు లొంగిపోగా, మరో 2 వేల మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పించి, వారిని సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అయినప్పటికీ కొందరు మొండిగా హింసను నమ్ముకుంటున్నారని, అలాంటి వారిని తుపాకులతోనే ఎదుర్కొంటామని ఘాటుగా హెచ్చరించారు. నక్సలిజం వల్ల ప్రాణాలు కోల్పోయిన భద్రతా సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హోంమంత్రి భరోసా ఇచ్చారు. 45 డిగ్రీల ఎండలో సైతం ప్రాణాలకు తెగించి అడవుల్లో పహారా కాస్తున్న జవాన్ల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. వారి పోరాటం వల్లే దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాల సంఖ్య 35 నుంచి సున్నాకు చేరిందని వెల్లడించారు. నక్సలైట్లు అడ్డుకున్నా ఏజెన్సీ ప్రాంతాల్లో మొబైల్ టవర్లు, బ్యాంకులు, పోస్టాఫీసుల ఏర్పాటును వేగవంతం చేశామని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ పాఠశాల ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, తద్వారా గిరిజన యువతకు విద్యను చేరువ చేస్తున్నామని పేర్కొన్నారు. దేశం మొత్తం ఇప్పుడు అభివృద్ధి పథంలో పయనిస్తుంటే, నక్సలైట్లు మాత్రం వినాశకర బాటలో ఉన్నారని విమర్శించారు.

సల్వాజుడుం వంటి కార్యక్రమాల పేరుతో కాంగ్రెస్ గతంలో గిరిజనుల మధ్య చిచ్చు పెట్టిందని అమిత్ షా ఆరోపించారు. ఆ సమయంలో జరిగిన దారుణాలకు కాంగ్రెస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. న్యాయవ్యవస్థలోని కొందరు తమ వ్యక్తిగత సిద్ధాంతాలను తీర్పుల్లో జోడించడం సరికాదని హితవు పలికారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధుల కొరత లేదని, కేవలం శాంతిభద్రతల సమస్య వల్లే కొన్ని పనులు ఆలస్యమవుతున్నాయని వివరించారు.

## పెద్దబావి గ్రామ పంచాయతీకి నూతన కార్యదర్శి శరణ్య బాధ్యతలు స్వీకారం



**మోటకొండూరు, విశాలభారతి:** మోటకొండూరు మండలంలోని నూతనంగా ఏర్పడిన పెద్దబావి గ్రామ పంచాయతీకి నూతన కార్యదర్శిగా శరణ్య సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెలుపుల రజిత శ్రీరాములు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామ అభివృద్ధి, పారదర్శక పరిపాలన, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కార్యదర్శి కీలక పాత్ర పోషించాలని సర్పంచ్ ఆకాంక్షించారు. ప్రభుత్వ పథకాలు గ్రామ ప్రజలకు సకాలంలో చేరేలా కృషి చేయాలని సూచించారు. నూతన బాధ్యతలు తీసుకున్న శరణ్య కార్యదర్శిగా గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సప్పిడి ఉపేందర్, ఉపసర్పంచ్ అంజిరెడ్డి, వార్డు సభ్యులు వాకిటి మల్లారెడ్డి, జల్తారు రాజు, బండ రజిత, వెలుపుల నాగరాణి, సప్పిడి నవ్య, మాటూరూ గ్రామ కార్యదర్శి సాయికుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన ఆశలు



**మోటకొండూరు,విశాలాభారతి:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశాలు నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమకి నెలకి 18,000 జీతంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని గతంలో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ హామీని నెరవేర్చడం లేదని ఆరోపించారు. అందుకోసం ఈనెల 28న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశలు హైదరాబాదులో నిరసన తెలుపడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్టే ఇచ్చి ఎక్కడికి అక్కడ వెళ్లకుండా అరెస్టులు చేయించిందని చెప్పారు. తమకు న్యాయం జరిగే వరకూ తమ పోరాటం ఆగదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆశాలు రేణుక, జయమ్మ, మహాలక్ష్మి, పద్మ, ఐలమ్మ, స్వరాజ్యం, సంతోష, భార్గవి మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 10వ తేదీ వరకు సిపిఐ ఇంటింటా కార్యక్రమం



**మోటకొండూరు,విశాలాభారతి:** ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 10వ తేదీ వరకు సిపిఐ ఇంటింటా కార్యక్రమం నిర్వహించబోతుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పోరగాని సత్యనారాయణ వెల్లడించారు. మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాలు పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇండ్లను మంజూరు చేసిందని గుర్తు చేశారు. వాటిలో ఇప్పటివరకు పేద ప్రజలు ఆనందంగా ఉంటున్నారని చెప్పారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని క్రయవిక్రయాలు జరుపోద్దని చెప్పడంతో పేద ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి అన్నారు. ఆ ఇండ్లు, స్థలాలపై విధించిన నిషేధం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తే పెద్ద ఎత్తున ఉత్యము చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, పట్టణ కార్యదర్శి ఆలేటి బాలరాజు, నాయకులు రేవు సిద్దయ్య, పల్లె శ్రీను, సూదగాని వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీఎస్టీ చట్టంపై అవగాహన కార్యక్రమం



**ఆలేరు, విశాలాభారతి :** ఆలేరు మండలం పటేల్‌గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్సీఎస్టీ (అత్యాచారాల నివారణ) చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల తహసీల్దార్ ఆంజనేయులు సోమవారం మాట్లాడారు.ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కులను రక్షించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన ఉండాలని ఆయన తెలిపారు. ఎస్సీ ఎస్టీ చట్టం ద్వారా బాధితులకు లభించే రక్షణ, న్యాయ సహాయం, పరిహారం వంటి అంశాలను వివరించారు.ఏదైనా అన్యాయం జరిగినప్పుడు వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో చట్టపరమైన హక్కులపై అవగాహన పెరిగిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుమారస్వామి, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, ఆర్ఐ పూర్ణచంద్రరావు, ఉప సర్పంచ్ బయన్న, ఏపీవో అరుణకుమారి, హెచ్‌డబ్ల్యూ ఆనందు, ఐసీడీఎస్ సూపర్వైజర్ ఉమారాణి, పంచాయతీ కార్యదర్శి మీనాభాయి, మహిళా సంఘం అధ్యక్షురాలు మమత, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేరూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా తోట మహేష్



**వాజేడు , విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండల పరిధి పేరూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా తోట మహేష్ నియమించడం జరిగింది. గతంలో ములుగులో పనిచేసే బదిలీపై వాజేడు మండలం పేరూరు గ్రామపంచాయతీకి రావడం జరిగింది. గ్రామపంచాయతీ అభివృద్ధికి పాలకవర్గంతో మరియు ప్రజలతో కలిసి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు.

## ఘనంగా కామ్రేడ్ పోరెల్ల దాసు 8వ వర్ధంతి సభ

**తిరుమలగిరి,విశాలభారతి :** భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు,వీర తెలంగాణ విప్లవ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, భారత దేశ విముక్తి స్వాతంత్ర్య పోరాట యోధుడు, పోరెల్ల దాసు 8వ, వర్ధంతి కార్యక్రమం తొండ తిరుమలగిరి తెలంగాణ చౌరస్తా లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోరెల్ల చిత్రపటానికి పలువురు పుష్ప గుచ్చాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు.కార్యక్రమంలో సీపీయం మండల కార్యదర్శి గుమ్మడి వెల్లి ఉప్పలయ్య పాల్గొని మాట్లాడుతూ, 1946 నుండి 1951 వరకు జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణాలకు తెగించి తన యవ్వన జీవితమంతా పేద ప్రజల కోసం ధారపోసిన ధీశాలి పోరెల్ల దాసు అని అన్నారు. సూర్యాపేట తుంగతుర్తి ప్రాంతంలో దొరలు, పెత్తందారులు, నైజాం రజాకార్లు, యునియన్ సైన్యాల దోపిడీ దౌర్జన్యాలు, భూస్వామ్య గూండాల, అరాచకాలను,దురాగతాలను ఎదిరించి ఆంధ్ర మహాసభ, ఎర్రజెండా పిలుపు అందుకొని స్వతంత్ర పోరాటంలో ,తెలంగాణ సాయుధ పోరాటంలో ముందున్నారున్నారు. వెట్టి చాకిరీ నుండి పేద ప్రజలను రక్షించేందుకు వెన్ను చూపని పోరాటాలు చేశారన్నారు. పోరాట విరమణ అనంతరం తొండ గ్రామానికి 26 సం. లు. సర్పంచుగా, మరో ఆరు సంవత్సరాలు తిరుమలగిరి మండల పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికై ప్రజా సేవకే అంకితమైన నిఖార్సైన జనం నాయకుడుగా పేరు ప్రతిష్టలు గడించిన నిస్వార్థ జీవి అని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు కొత్త గట్టు మల్లయ్య, సీపీయం సీనియర్ నాయకులు కడెం లింగయ్య, కడారి లింగయ్య, ఆకులు సోమయ్య, బూర్గుల ప్రభాకర్,మండల నాయకులు లక్ష్మి , యం సీపీఐ రమేష్, చేను శ్రీనివాస్, నాగార్జున, పోరెల్ల లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



## బకాయిలు చెల్లించని కంపెనీ జప్తు

### స్వయంగా పర్యవేక్షించిన కమిషనర్ జి.వెంకటరాంరెడ్డి



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ పరిధిలోని డిస్కవరీ లాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను మున్సిపల్ అధికారులు సోమవారం నాడు జప్తు చేశారు.202425 మరియు 202526 ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా, పెండింగ్‌లో ఉన్న భారీ బకాయిల వసూలు కోసం మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరాంరెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కఠిన చర్యలు చేపట్టారు. అనంతరం కమిషనర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ...సదరు కంపెనీ గత రెండు సంవత్సరాలుగా రూ. 6,42,740 ఆస్తి పన్ను బకాయి పడిందని తెలిపారు.దాని కారణం చేత గతంలోనే యాజమాన్యానికి పలుమార్లు రెడ్ నోటీసులు, షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో చట్టపరమైన జప్తు చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు.నేడు ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో, మొండి బకాయిల వసూలు పై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.పట్టణ అభివృద్ధి పనులకు ఆస్తి పన్నులే ప్రధాన వనరులని, పన్నులు చెల్లించని పక్షంలో ఎంతటి సంస్థలపైనైనా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ అంజయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, వార్డు ఆఫీసర్ సలీం, బిల్ కలెక్టర్ అంజయ్య మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సివిల్ రైట్స్ డే సందర్భంగా అవగాహన



**కోదాడ, విశాలభారతి:** మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా కాపుగల్లు గ్రామ సర్పంచ్ దొంతగాని అప్పారావు గౌడ్, రిపబ్లిక్ అండ్ సీనా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా బోసు బాబు ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సివిల్ రైట్స్ డే సందర్భంగా గ్రామంలో కుల వివక్షకు ఎవరైనా ఇబ్బంది పడుతున్నారా అలాంటి ఏవైనా ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని అవగాహన కల్పించారు. అనంతరం రిపబ్లిక్ అండ్ సీనా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా బోసు బాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ కి ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని కొనియాడారు. ఢిల్లీ, ముంబాయి లో జరగబోయే అంబేద్కర్ ఉత్సవాలను అంబేద్కర్ అభిమానులు ప్రజలు తిలకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ జగదీష్, పంచాయతీ సెక్రటరీ వెంకట్ నారాయణ, జిపిఓ నాగుల్ మీరా, స్థానిక నాయకులు ఓర్సు గోపి, జిల్లా నాయకులు గుడివైన శ్రీనివాసరావు, గణపవరపు శ్రీనివాసరావు, చారి, ఉదర బాబురావు, నూకపంగు మహేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యం పర్యవేక్షణ



**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండలం పరిధి ఎంపీ యుపిఎస్ జగన్నాథపురం మరియు ఎంపీపీఎస్ చెరుకూరు పాఠశాలల్లోని మూడవ తరగతి విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించడానికి కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్ విద్యార్థుల యొక్క సామర్థ్యాలను పరీక్షించడం జరిగింది. మూడవ తరగతి విద్యార్థులకు సామర్థ్యాలను పరీక్షిస్తున్న సమయంలో ములుగు జిల్లా ఉల్లాస్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణ బాబు మరియు వాజేడు మండల విద్యాధికారి తేజావత్ వెంకటేశ్వర్లు పర్యవేక్షించడం జరిగింది. ఎఫ్ ఎల్ ఎస్ ఫీల్డ్ ఇన్వెస్టర్లుగా డి ఈడీ విద్యార్థులు వైష్ణవి మరియు అంజలి పాల్గొన్నారు.

## అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**ఆలేరు,విశాలాభారతి:** అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షులుగా శిఖలం కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఎలగందుల సిద్దులు ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా పద్మ సుదర్శన్, ఇక్కిరి సహదేవ్, మామిడాల బాలమల్లేష్, మాలోతు మోతీలాల్, మారిజోడు సిద్దేశ్వర్, ఉదయ్ తదితరులు ఎంపికయ్యారు. మొత్తం 9 మంది సభ్యులతో నూతన కమిటీ ఏర్పడింది.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ, ఏప్రిల్ 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో అరుణోదయ సాంస్కృతిక సమైక్య తెలంగాణ రాష్ట్ర 7వ మహాసభలు జరగనున్నట్లు తెలిపారు.రాష్ట్రం నలుమూలల నుండి అరుణోదయ కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారని, మహాసభల ముందు రోజు కళాకారుల ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ప్రజా కళారంగంలో అనుభవం ఉన్న మేధావులు, సాంస్కృతిక రంగ ప్రముఖులు ఈ మహాసభల్లో పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేయనున్నారని తెలిపారు.సమాజంలో పెరుగుతున్న మతతత్వ, మనువాద, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వివిధ కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## ప్రజల సౌకర్యార్థం వలిగొండ
# రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం

- ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తా
- మొగదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్మన్
- జి.వెంకటరామిరెడ్డి కమిషనర్



**విశాలభారతి:**

పట్టణ ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా,వలిగొండ రోడ్డు అభివృద్ధి పనులను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేస్తామని చౌటుప్పల్ పురపాలక సంఘం చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గారు పేర్కొన్నారు. గత కొంతకాలంగా వలిగొండ రోడ్డు గుంతలతో అస్తవ్యస్తంగా మారి, వాహనదారులు మరియు స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని, చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు మరియు కమిషనర్ జి.వెంకట్రాం రెడ్డి ఆధ్వర్యంలో నేడు రోడ్డు మరమ్మతు పనులు చేపట్టి,రాకపోకలకు అనువుగా సవ్యంగా చేయించడం జరిగింది.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ..మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక సహకారంతో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.రోడ్లు మరియు భవనాల శాఖ ఇంజనీర్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, సాంకేతిక ఆటంకాలను త్వరితగతిన పరిష్కరించి శాశ్వత రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.చిన్నచిన్న అడ్డంకులను తొలగించి,సాధ్యమైనంత త్వరగా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. నగర ప్రజల సౌలభ్యం కోసం మున్సిపల్ యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని, అభివృద్ధి పనుల్లో ప్రజలందరూ సహకరించాలని ఈ సందర్భంగా ఒక ప్రకటనలో కోరారు.

## ఫ్లెక్సీలను తొలగించండి
# పర్యావరణాన్ని కాపాడండి



జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

కొత్తగూడెం కలెక్టరేట్ : కొత్తగూడెం నియోజకవర్గంలో గత కొంతకాలంగా అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను తొలగించాలని జై భీమ్ రావు భారత్ పార్టీ(జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ గ్రీవెన్స్ డే ని పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్ కు ఫిర్యాదు చేశారు.ఈ సంధర్భంగా కామేష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు జాతీయ ప్రధాన రహదారుల సెంటర్ పోల్స్ కు అడ్డగోలుగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రమాదాలకు కారణం అవుతున్న ఫ్లెక్సీ షాపుల యజమానులపై చర్యలు తీసుకోవాలని, విచ్చలవిడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం మూలంగా పర్యావరణానికి హాని కలిగించే విధంగా వారి చర్యలు ఉన్నాయన్నారు.కొత్తగూడెం కార్పొరేషన్ తో పాటు జిల్లాలోని వివిధ మండలాలలో ఏ విధమైన అనుమతులు లేకుండా పెద్ద పెద్ద హోర్డింగులను ఏర్పాటు చేసినా సంబంధిత మున్సిపల్ మరియు పంచాయితీ సిబ్బంది చర్యలు తీసుకోకుండా చూసి చూడనట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు.దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నప్పటికీ ఏ విధమైన అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న సదరు ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులపై చర్యలు తీసుకుని ప్రకృతిని కాపాడాలని కోరారు.గతంలో ఇక్కడ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన అనుదీప్ జిల్లా అంతటా ఫ్లెక్సీ హోర్డింగ్ లను తొలగించిన విషయాన్ని ఈసందర్భంగా గుర్తు చేశారు.తక్షణమే స్పందించి కొత్తగూడెం కార్పొరేషన్ మరియు జిల్లాలోని వివిధ మండలాలలో పర్యావరణానికి హాని కలిగించే విధంగా ప్లాస్టిక్ తో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకొని అనుమతులకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన హోర్డింగులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంధం మల్లికార్జున రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మలోత్ వీరు నాయక్,అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్,కొండా విజయభాస్కర్,ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# జేజమ్మగా శ్రీలీల?

2009లో 'అరుంధతి'గా బాక్సాఫీస్ వద్ద అనుష్క చేసిన హంగామా అందరికీ తెలిసిందే. అనుష్కను నేటికీ అంతా జేజమ్మ అని ముద్దుగా పిలుచుకుంటారు. ఆమె ఇమేజ్‌పై ఆ పాత్ర ప్రభావం అలాంటిది. సినిమా వచ్చి 17 ఏండ్లయినా గద్వాల్ రాణిగా అనుష్క కనపరచిన రాజసం ఎవరూ మరిచిపోలేదు. అలాంటి ఈ సినిమాను బాలీవుడ్‌లో పునర్నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. టాలీవుడ్ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ నిర్మించనున్న ఈ చిత్రంలో 'అరుంధతి'గా శ్రీలీల నటించనున్నట్టు సోషల్ మీడియాలో వార్తలొస్తున్నాయి.తమిళ దర్శకుడు మోహన్‌రాజాను దర్శకుడిగా పరిశీలిస్తున్నారట. ఇదిలావుంటే.. అసలు జేజమ్మ పాత్రకు శ్రీలీల న్యాయం చేయగలదా? అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో ఉత్పన్నమవుతున్నాయి. రీమేక్ చేసే బదులు, సీక్వెల్ చేస్తే బావుంటుందని మరికొందరు నెటిజన్స్ సలహాలు కూడా ఇస్తున్నారు. అసలు ఈ వార్తలో నిజం ఎంతుందో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.